నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
12 వరంగల్, శనివారం 25 జనవరి 2025 MAHABUBABAD



పెన్షన్ రావడం లేదని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సమక్షంలో వేడుకుంటున్న పబ్బు సమ్మక్క

## కమలాపూర్‌లో కాంగ్రెసోళ్ల దౌర్జన్యం

రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి

- బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల పోటాపోటీ నినాదాలు
- పోలీసులు అడ్డుకున్నా పట్టించుకోని అధికార పార్టీ నాయకులు



ఏవో రాజ్‌కుమార్‌పై కాంగ్రెస్ నాయకులు విసిరిన కోడిగుడ్డు

కమలాపూర్, జనవరి 24 : కమలాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోయారు. అక్కడి గ్రామ పంచాయతీలో శుక్రవారం జరిగిన గ్రామసభలో అధికార అండతో దౌర్జన్యం చేశారు. ఈ కార్యక్రమానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. కాగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిందని ఒక్క రేషన్ కార్డు, ఇల్లు ఇవ్వలేదని, కట్టించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిరుపయోగం అయ్యాయని వ్యాఖ్యలు చేయగా.. ఎమ్మెల్యే లేచి వెంటనే బీఆర్ఎస్ సర్కారు ఆరు లక్షల రేషన్ కార్డులు ఇచ్చిందని, డబుల్‌బెడ్ రూం ఇండ్లు కట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దీంతో రెచ్చిపోయిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయగా కాజీపేట ఏసీపీ తిరుమల్ ఇది అధికారిక కార్యక్రమమని.. రాజకీయ విమర్శలు చేయొద్దని చైర్మన్ ఝాన్సీకి సూచించారు. అయితే ఎమ్మెల్యేకు కూడా ఏసీపీ చెప్పాలంటూ కాంగ్రెస్ నాయకులు స్టేజీపైకి దూసుకొచ్చారు. పోలీసులు అడ్డుకున్నా ఆగలేదు. ఈ క్రమంలో ఎమ్మెల్యే స్టేజీ కిందకు దిగి ప్రజల మధ్య కూర్చున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమలాపూర్‌కు ఎన్ని ఇండ్లు మంజూరు చేసిందో ఎంపీడీవో చెప్పాలని ప్రశ్నించగా కమలాపూర్‌కు 1440 ఇండ్లు, ఇంటి జాగ లేని వారికి 259 లబ్ధిదారుల పేర్లు ఎంపిక చేసినట్లు ఎంపీడీవో బాబు చెప్పారు. ఎంపికైన లబ్ధిదారుల్లో ఎంతమందికి ఇండ్లు ఇస్తరో ఎంపీడీవో చెప్పాలని కౌశిక్‌రెడ్డి గట్టిగా ప్రశ్నించారు. నియోజకవర్గానికే 3500 ఇండ్లు వస్తే కమలాపూర్‌కు ఎన్ని ఇండ్లు వస్తాయో చెప్పాలని అడగడంతో కాంగ్రెస్ నాయకులు మరింత అసహనానికి గురై రాళ్లు, టమాటాలు విసిరారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య పోటాపోటీగా నినాదాలు చేయడంతో సభ గందరగోళంగా మారింది. ఆ తర్వాత ఎంపీడీవో బాబు.. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని స్టేజీ మీదకు రావాలని ఆహ్వానించారు. మాట్ల సంతోష, పబ్బు సమ్మక్క, కనక లక్ష్మిలు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఝాన్సీలకు గోడు వెళ్లబోసుకుంటుండగా ఎమ్మెల్యే బాధితులకు మైకు ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు మళ్లీ గొడవకు దిగారు. దీంతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. మొన్నటిదాకా బీఆర్ఎస్‌లో ఉండి లబ్ధి పొంది ఇవాళ అధికారం పోగానే కాంగ్రెస్‌లో చేరి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతారా? సిగ్గుండాలె? నేను సీఎం రేవంత్‌రెడ్డికే భయపడలే, మీకు భయపడతానా? ఏండ్ల తరబడి జెండా మోసిన నిజమైన కాంగ్రెస్ నాయకులు మాట్లాడితే నేను ఆహ్వానిస్తానని ఎమ్మెల్యే అన్నారు. కేవలం సర్పంచ్ ఎన్నికల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నదన్నారు. బీఆర్ఎస్ తరపున సభను బైకాట్ చేస్తున్నానని చెప్పి కుర్చీలోంచి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి లేచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు కోడిగుడ్లు విసరడంతో మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్‌కు తగిలింది. అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఎమ్మెల్యేను కాన్వాయ్ వద్దకు తీసుకెళ్లారు. ఏసీపీ తిరుమల్, సీఐ హరికృష్ణ, హసన్‌పర్తి సీఐ చేరాలు, ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎస్సై వీరభద్రరావులతోపాటు సిబ్బంది బందోబస్తు నిర్వహించి భౌతికదాడులు చేసుకోకుండా ఇరువర్గాలను పంపారు.

## ప్రజల గొంతుకనై ప్రశ్నిస్తూనే ఉంటా..


- కమలాపూర్‌లో నాపై కాదు.. అధికారులపై దాడి జరిగింది
- కాంగ్రెస్ అసత్య ప్రచారాలు మానుకోవాలి
- గొడవల్లేని గ్రామసభ ఎక్కడైనా జరిగిందా?
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, జనవరి 24 : 'కమలాపూర్‌లో గ్రామసభలో దాడి జరిగింది నాపై కాదు. అధికారుల మీద జరిగింది. టమాటాలు, కోడిగుడ్లు విసిరారు. కాంగ్రెస్ అసత్య ప్రచారాలు మానుకోవాలి. కొన్ని చానళ్లు తప్పుడు సమాచారంతో ట్రోలింగ్ చేస్తున్నాయి. కాంగ్రెస్ నాయకులు టమాటాలు, కోడిగుడ్లు ప్రజలకు పంచండి. అధికారుల మీద దాడంటే.. మీ ప్రభుత్వంపై మీరు దాడి చేసుకున్నట్లే. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు నామోచేతి నీళ్లు తాగినోళ్లంతా ఆ పార్టీలో చేరిండ్రు. కౌశిక్.. కేసులకు భయపడే వ్యక్తి కాదు. ప్రజల గొంతుకనై ప్రశ్నిస్తూనే ఉంటా.. పథకాలు అమలు చేసేవరకూ ఉద్యమిస్తా'నని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాజకీయ డ్రామాలు చేస్తున్నదని దుయ్యబట్టారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇచ్చారని, గ్రామానికి 20 ఇళ్లు మాత్రమే వస్తాయని తెలిపారు. మరి గ్రామసభల్లో వందలాది మందికి ఇళ్లు ఇస్తున్నట్లు దరఖాస్తులు తీసుకోవడం.. ప్రజలను బ్లాక్‌మెయిల్ చేయడమేనన్నారు. ఒక్క పథకాన్ని కూడా అమలు చేసేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదని, కాలయాపనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదని ఆరోపించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తున్నందుకే కేసులు పెడుతున్నారని, గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సర్కారు డ్రామాలను ఎప్పటికప్పుడు కేసీఆర్ ఆధ్వర్యంలో ఎండగడుతూనే ఉంటామని పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ రైతు వ్యతిరేకి

- హామీల అమలులో కాంగ్రెస్ ఘోరంగా విఫలం
- రైతుల పక్షాన ఒక్క మాట మాట్లాడని ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- రైతు ధర్నాలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య ఫైర్

జఫర్‌గఢ్, జనవరి 24 : ఎన్నికలప్పుడు రాష్ట్రంలోని రైతన్నలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కటీ అమలుచేయకుండా అన్యాయం చేస్తూ రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేక ముఖ్యమంత్రి అయ్యారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు జఫర్‌గఢ్ మండల కేంద్రంలో శుక్రవారం రైతు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే రాజయ్య పాల్గొన్నారు. అనంతరం గాంధీ సెంటర్‌లో రాజయ్య మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రుణమాఫీ, వరి ధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా రూ.15 వేలు, కౌలు రైతులకు భరోసా తదితర హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు అట్టర్ ప్లాప్ అయిందని అన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో దృష్టిలో పెట్టుకుని గ్రామసభలు నిర్వహించారని, కానీ ప్రజలు చైతన్యవంతులై గ్రామ గ్రామాన నిలదీయంతో సభలన్నీ విఫలమయ్యాయని పేర్కొన్నారు. రైతులకు, ప్రజలకు ఇంత అన్యాయం జరుగుతున్నా ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికార దాహంతో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. బీఆర్ఎస్ గుర్తుతో గెలిచి, అధికారం కోసం కాంగ్రెస్‌లో చేరిన శ్రీహరి ఇప్పటికైనా తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో నిలవాలని సవాల్ చేశారు. ప్రజలకు భయపడి శ్రీహరి గ్రామసభల్లో పాల్గొనలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ హామీలన్నీ నెరవేర్చకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి తగిన గుణపాఠం చెబుతామని రాజయ్య హెచ్చరించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమని, కాంగ్రెస్‌కు, ఎమ్మెల్యే శ్రీహరికి ప్రజలే బుద్ధిచెబుతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పసునూరి మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మారపాక రవి, ఆకుల కుమార్, సోమిరెడ్డి, చందర్‌రెడ్డి, కడారి శంకర్, కోత్వాల కుమార్, నాయిని నరేశ్, పులి ధనుంజయ్, పెంతల రాజ్‌కుమార్, తాటికాయల వరుణ్, యార సోమిరెడ్డి, ఎండీ నజీర్, సింగారపు శ్రీధర్, సుతారి అశోక్, గోలి కవిత, మారపల్లి కర్నాకర్, రాధిక, మాచర్ల శ్రీనివాస్, ఆకారపు యాకయ్య, మంద రాజయ్య, యాదగిరి, మేర్గు రమేశ్, గబ్బెట కొమురయ్య పాల్గొన్నారు.



రైతు ధర్నాలో మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి గ్రామసభలో ప్రజలను అడ్డుకుంటున్న పోలీసులు



# నిరసన గళం
# తిరగబడ్డ జనం



మంగపేట: బోరునర్సాపురం గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న మహిళలు

రేషన్ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామసభల్లో జనం తిరగబడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా చివరి రోజు శుక్రవారం నిరసనలు, నిలదీతలతో కొనసాగాయి. ప్రభుత్వ పథకాలు అనర్హులకే వచ్చాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులమైనా తమకు ఎందుకు రాలేదని మండిపడ్డారు. పలు చోట్ల పేదలకు పథకాల లిస్టులో చోటుదక్కలేదని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించగా, వారితో కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడక్కడా గ్రామ సభలు రణరంగాన్ని తలపించాయి. దీంతో పోలీసు పహారా మధ్య నిర్వహించారు. తూతూమంత్రంగా సమావేశాలు నిర్వహించడంపై స్థానికులు భగ్గుమన్నారు. కాగా, భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం వల్లెంకుంట గ్రామ సభలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి, ఆయన కొడుకు పేర్లు చదవడంతో గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇళ్లు లేనివారిని పక్కనబెట్టి అన్ని ఉన్నోళ్లకు ఇచ్చుడేందంటూ నిలదీయడంతో సమాధానం చెప్పలేకపోయారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచ గ్రామంలో ఎస్సైకి ఆత్మీయ భరోసాలో పేరు రావడంతో గ్రామస్తులు గొడవకు దిగారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లే అధికారులు లిస్టు తయారు చేశారని ఆరోపించారు. - నమస్తే నెట్‌వర్క్, జనవరి 24



వెంకటాపూర్: అధికారులతో వాగ్వాదానికి దిగగిన గ్రామస్తులు

- ప్రభుత్వ పథకాలు అనర్హులకే వచ్చాయని ఆగ్రహం
- జాబితాలో తమ పేర్లు రాలేదని అధికారుల నిలదీతలు
- చివరి రోజూ ప్రజాపాలన గ్రామసభల్లో కొనసాగిన నిరసనలు
- పలు చోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం
- పోలీసు పహారా మధ్య నిర్వహణ

## ఆఖరి రోజూ.. అదే తీరు

### నా పేరు ఎండ్ల రాలే..



టేకుమట్ల, జనవరి24: నేను ఇల్లు అమ్మి ఇద్దరి బిడ్డల పెండ్లి చేసిన. అప్పులు తీర్చడం కోసం గోదావరిఖనిలో జీతం ఉండడానికి పోయిన. నాకు గుంట భూమి(ఇల్లు అడుగు) మాత్రమే ఉన్నది. ఇందిరమ్మ ఇల్లు కావాలని, ఇందరమ్మ ఆత్మీయ భరోసాలో రూ. 12000 కావాలని దరఖాస్తు పెట్టకున్న. నా పేరు ఎండ్ల రాలే. ఎందుకు రాలేదని అడిగితే మళ్ల దరఖాస్తు ఇయ్యమంటున్నరు. ఎకరాల కొద్ది భూములు ఉన్నోళ్ల పేర్లు ఇండ్ల లిస్ట్‌లో వచ్చినయ్. అప్పులు తీర్చాలనే నేను వలస పోయిన. మళ్ల ఉపాధి పని ఎప్పుడు అచ్చి చేయాలే. జిరాక్స్‌లకు, బస్సు కిరాయిలకు పైసలు పెట్టుకుని లాస్ అయిన. అధికారులు నా పరిస్థితి గుర్తించి నాకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తే ఊర్లోకి అచ్చి నా కొడుకు లగ్గం చేయాలని అనుకుంటాన. సారూ.. మీరే దయ చూపాలె.

– రామగిరి సదానందం, పెద్దంపల్లి, టేకుమట్ల, జయశంకర్ భూపాలపల్లి



నర్సింహులపేట: కొమ్ములవంచలో పేదల పేర్లు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తున్న మహిళ




పరకాల: జాబితాలో తమ పేరు రాలేదని వార్డు సభలో అధికారులు, కౌన్సిలర్ల ఎదుట విలపిస్తున్న ఓరుగంటి రమ



మల్హర్ : వల్లెంకుంటలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు



బయ్యారం : జాబితాపై అధికారులను నిలదీస్తున్న ప్రజలు



నర్మెట: కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్న బీఆర్ఎస్ నాయకులు



టేకుమట్ల; ఎంపేడులో తమ పేర్లు రాలేదని అందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

### గ్రామసభలో మహిళకు అస్వస్థత

దంతాలపల్లి, జనవరి 24 : మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని దొనకొండ గ్రామసభలో శుక్రవారం మహిళ అస్వస్థతకు గురైంది. గ్రామసభ నిర్వహిస్తుండగా ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ భరోసా పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన కొంపెల్లి మమత అస్వస్థతకు గురైంది. చికిత్స అందించాల్సిన వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో స్థానికులు దంతాలపల్లిలోని దవాఖానకు తరలించారు. అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు మండిపడ్డారు.



అస్వస్థతకు గురైన మమత

### ఇల్లు ఇత్తరని ఆశపడ్డా..



బయ్యారం: నా పేరు మేఖ కాంతమ్మ. మాది పేద కుటుంబం. ప్రజాపాలనలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న. సర్వే కోసం ఇంటికి వచ్చిన అధికారులు మట్టి గోడలు, పెంకు ల ఇల్లును ఫొటో తీసుకున్నారు. ఇక ఇల్లు వస్తుదని అనుకున్న. పిల్లలు లేని నాకు ఇల్లు వస్తే అనారోగ్యంతో ఉన్న భర్తతో కలిసి అందులో ఉందామనుకున్నా. నడవలేని స్థితి, ఇబ్బందిగానైనా గ్రామసభకు వచ్చిన. నా పేరు వస్తదని చివరి వరకూ ఎదురు చూసిన. కానీ పేరు రాకపోవడంతో ఎంతో ఆవేదనగా ఉన్నది. ఏంచేద్దాం.. నిరాశతో పోతాన..

–కాంతమ్మ, వృద్ధురాలు, బయ్యారం



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు

## పనికిరాని గ్రామసభలు

- అర్హులందరికీ సంక్షేమ పథకాలివ్వకుంటే నిలదీయండి
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు

నెల్లికుదురు, జనవరి 24: ప్రజాపాలనలో మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకోమ్మని చెప్పడానికి నిర్వహించే గ్రామసభలు పనికిరానివని, అర్హులకు మొండిచేయి చూపిస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. నర్సింహులగూడెంలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్సీ పాల్గొనగా, 525 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, గ్రామంలో 1800 ఎకరాలకు రైతు భరోసా అర్హులని, 66 ఎకరాలకు అనర్హులని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి మాట్లాడుతూ ఇల్లు లేనివారి పేరు ఈ లిస్టులో లేకపోతే అన్యాయమైపోతారన్నారు. 66 ఎకరాల్లో అర్హత ఉండి కూడా అనర్హులుగా గుర్తించినట్లయితే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు పారదర్శకంగా రేపు అర్హులందరికీ ఈ నాలుగు పథకాలు అందజేయాలని, లేదంటే ప్రభుత్వాన్ని నడిరోడ్డుపై నిలదీయాలన్నారు. ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తుల జాబితా చదవడానికి గ్రామసభలు అవసరమా?, అధికారులు పార్టీలకతీతంగా అర్హుల జాబితాను సిద్ధం చేసి వారికే పథకాలు ఇవ్వాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. వీళ్లు అర్హులు అని తీర్మానం చేయకుండా కేవలం దరఖాస్తు చేసుకున్నోళ్ల పేర్లు చదివి అధికారులు వెళ్లిపోతున్నారని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ఫాల్స్, టైంపాస్, డైవర్షన్ సభలు నిర్వహిస్తున్నదన్నారు. అదేవిధంగా సీతారాంపురంలో జరిగిన గ్రామసభలో రేకులతండాకు చెందిన ప్రజలు పైసలిచ్చిన వాళ్ల పేర్లు జాబితాలో పెడుతావా.. ఏమీలేని మా తండావాళ్లను విస్మరిస్తావా అంటూ పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

- స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసం కాంగ్రెస్ డ్రామాలు
- సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి ఏం సాధించారో చెప్పాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు




మైలారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

## మరోసారి మోసం చేసేందుకే గ్రామసభలు

దేవరుప్పుల/పెద్దవంగర/రాయపర్తి, జనవరి24: సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సంక్షేమ పథకాల పేరుతో గ్రామసభలు నిర్వహిస్తున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు డ్రామాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం దేవరుప్పుల, పెద్దవంగర మండలం గంట్లకుంట, రాయపర్తి మండలం మైలారం గ్రామాల్లో విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజల దృష్టి మరల్చేందుకే గ్రామసభలు పెట్టారని, అడుగడుగునా నిలదీతలతో రేవంత్ రెడ్డి పథకం బెడిసి కొట్టిందన్నారు. అర్హులందరికీ ఇండ్లివ్వాలంటే పదేళ్లు పడుతుందని, ఎవరిని మోసం చేయడానికి గ్రామసభలు పెట్టిండ్రని మండిపడ్డారు. ఓ వైపు ఉపముఖ్యమంత్రి భట్టి తాము అధికారికంగా ఇండ్లు, రేషన్ కార్డులు కానీ అనౌన్స్ చేయలేదంటున్నారని, ఇక గ్రామ సభ లెందుకు.. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికా అని ఆయన ప్రశ్నించారు. ఈ జిమ్మిక్కులన్నీ మాని ఇచ్చిన హామీలు నెరవేర్చండని హితవు పలికారు. పెట్టుబడుల కోసం తెలంగాణ రైజింగ్ బృందం దావోస్ పర్యటనకు వెళ్లి ఏం సాధించిందో చెప్పాలన్నారు. అంతా ఉత్తదేనని, విమానం కిరాయిలు దండగన్నారు. ఈ ఫార్ములా రేస్, పారిశ్రామిక ఒప్పందాలతో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దిన నైపుణ్యం కేటీఆర్ వద్ద ఉంటే, ఆయనను కేసుల పాలు చేయాలని చూస్తున్న ఈ ప్రభుత్వంపై ప్రపంచ పారిశ్రామిక వేత్తలకు నమ్మకం పోయిందని ఎర్రబెల్లి అన్నారు. గ్రామసభల్లో తమకు సంక్షేమ పథకాలుగా గుర్తించి మంజూరు పత్రాలు అందజేస్తారని ఊహించిన వారికి అధికారులు అర్హుల జాబితాలను మాత్రమే చదువుతుండడంతో ఎక్కడికక్కడ ప్రజలు నిలదీస్తోంటే ప్రభుత్వం పోలీస్ యంత్రాంగంతో వాళ్ల గొంతులు నొక్కే ప్రయత్నాలు చేయిస్తున్నదని మండిపడ్డారు. వారు కాంగ్రెస్‌కు మద్దతుదారులుగా వ్యవహరించడాన్ని తాము చూస్తూ ఊరుకునేది లేదని దయాకర్‌రావు హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, మండల నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, పూస మధు, లేతాకుల రంగారెడ్డి, మధూకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బిల్ల వెంకట్‌రెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, సంది దేవేందర్‌రెడ్డి, గజవెల్లి ప్రసాద్, సంతోష్‌గౌడ్, పెరటి యాదవరెడ్డి, కుందూ రు యాదగిరిరెడ్డి, పరుపాటి రవీందర్‌రెడ్డి, మహ్మద్ యూసఫ్, ఎల్లస్వామి, సోమనర్సింహారెడ్డి, యాదగిరిరావు, వెంకన్న, సుధీర్‌కుమార్, భాస్కర్‌రావు, పూర్ణచందర్, కుమారస్వామి, హరీశ్‌యాదవ్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఎర్రబెల్లిని ఆప్యాయంగా పలకరిస్తున్న వృద్ధురాలు



### నమ్మి మోసపోయినం సారూ..

ఎర్రబెల్లితో పింఛన్‌దారులు

'నమ్మి మోసపోయినం సారూ.. ఇప్పుడు గోసపడుతున్నం.. ఇంత అన్యాయం చేస్తడనుకోలె.. దేవునసొంటోన్ని ఓడగొట్టినం' అని పింఛన్‌దారులు ఎర్రబెల్లితో అన్నారు. సింగరాజుపల్లిలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన పోస్టాఫీస్ ఎదుట పింఛన్ కోసం ఉన్న వృద్ధులను చూసి వెళ్లి పింఛన్ పెరిగిందా అని ప్రశ్నించారు. పెంచుడులేదు. గించుడులేదు. గదే రెండు వేలు, గదే మూడు వేలు అని చెప్పారు. సరే..చలికాలం మీ ముసలోళ్లకు చలిపెడుతుందని దుప్పట్లు తెచ్చిన.. అంటూ ఆప్యాయంగా అందించారు.